# మహాలక్ష్మమ్మగారి జ్ఞాపకార్థం!

చిన్న చిన్న చినుకులతో వర్షం. వాతావరణంలో వేడి తగ్గి, చల్లటి గాలులు మొదలయ్యాయి. పిల్లలు కేరింతలు కొడుతూ కాగితపు పడవలు చేసి ఆనందపడుతున్నారు. ఆ వాతావరణం గోపాలానికి చాలా ఇష్టం. అలాంటి సమయంలో వేడి వేడి మిరప కాయబజ్జీలు తింటూ ఒక స్ట్రాంగ్ కాఫీ తాగడం అతనికి ఆనందం కలిగించే విషయం.

అయినా అతని మనసు, మనసులో లేదు. కాలు కాలిన పిల్లిలా ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు. అప్పటికే శ్రీమతి పొయ్యిమీద నూనెలో వేగుతున్న బజ్జీల వార్త చెవిన వేసింది. అతడికి దేనిమీదా మనసు పోవడం లేదు. 'ఈ సమస్యను ఎలా అధిగమించాలి?' అనుకున్నాడు. మనసులో మళ్ళీ అంతర్మథనం.

'తను తప్పు చేశాడు. ఇది వారిలో వీరికో కాదు. తన బాస్ పట్ల. ఆయన తమ ఆఫీసులోకి చేరి ఆరునెలలే అయింది. చిన్నవయసులోనే ఆయన తమ కంపెనీకి రీజనల్ మేనేజరుగా వచ్చాడు. పేరు కృష్ణచైతన్య.

ఆయన వచ్చీరాగానే కొరడా ఝుళిపించాడు. పని చెయ్యని ఉద్యోగులకు పనిష్మెంట్, బాగా పని చేసేవారికి ఇంక్రిమెంట్- అలా ఉద్యోగుల్ని దారిలో పెట్టాడు. గోడలకు అందమైన చిత్రాలు. వందిమాగధుల్లా స్వాగతం పలికే పూలకుండీలు, ఆఫీసులోని అన్ని గదుల్లోనూ ఏర్పాటు చేయించాడు. ఇక ఆఫీసు మొదలైంది. మొదలు ముగిసే వరకూ వినిపించే మృదు మధురమైన సంగీతం.

ఇలా తమ ఆఫీసును ఒక కార్పరేట్ స్థాయికి చేర్చాడు. ఆయన ఖరగ్‌పూర్ ఐఐటిలో చదివాడు. అటు తర్వాత అహ్మదాబాద్‌లో ఐఐఎమ్.

విదేశాలల్లో మంచి ఉద్యోగం వదులుకుని తమ కంపెనీ ఆహ్వానం మేరకు డైరెక్ట్ పోస్టులో రీజనల్ మేనేజరుగా జాయినయ్యాడు.

ఈ ఆరునెలల్లో ఆయనకు తన పనితనం బాగా నచ్చింది. కంప్యూటర్ ప్రోగ్రామర్ అయిన తను చాలా సహాయకారిగా ఉంటున్నాడు ఆయనకు. వచ్చే సంవత్సరం తను ఆఫీసరు స్థాయికి ఎదగ బోతున్నాడు. అందుకు కృష్ణచైతన్య గారిచ్చే కాన్ఫిడెన్షియల్ రిపోర్టు తప్పనిసరి. ఇలాంటి పరిస్థితుల్లో తను ఆయనపట్ల ఈ తప్పు చేశాడు. ఇప్పుడేమిటి దారి?' తలపట్టుకున్నాడు గోపాలం.

"రండి బజ్జీలు తయారయ్యాయి" భార్య పిలుపు ఇంకోసారైతే మృదువుగా వినిపించేది. ఆవిడ పిలుపుకు బదులు చెప్పకుండా అలాగే కూర్చుండిపోయాడు.

బజ్జీలప్లేటు, మంచినీళ్ళగ్లాసుతో భార్య వసుమతి అతడు కూర్చున్న చోటుకొచ్చింది.

ఈ లోకంలో లేని అతడిని చేత్తోతట్టి- "ఏంటండీ, చిన్నపిల్లాడిలా, మరీ అంత భయపడిపోతున్నారు, మీ బాస్‌గారిని కలవండి, 'పొరపాటైంది సార్' అని కాళ్ళమీద పడండి. అంతా సర్దుకుంటుంది" అంది.

"పొరపాటా? ఇదేమన్నా చిన్నతప్పా, అసలు ఎవరైనా క్షమించే తప్పా... ఇంతకీ అమ్మాయి ఏది?" అన్నాడు. "మీరు నిన్న తిట్టారు కదా, అలిగింది, మీకు కనపడకుండా తిరుగుతోంది. ఎసైన్‌మెంట్ రాసుకోవడానికని ఫ్రెండ్ ఇంటికి వెళ్ళింది" అంది వసుమతి బజ్జీలప్లేటు అతడి చేతికి ఇస్తూ.

"పాపం చిన్న పిల్ల.... వెంటనే పిలువు. అదేం చేస్తుంది? అంతా నా తలరాత" అంటూ మళ్ళీ ఆలోచనల్లో మునిగిపోయాడు. ఎదురుగా బజ్జీల ప్లేటు నోరూరిస్తున్నా చెయ్యి వాటిమీదకు వెళ్ళలేదు గోపాలానికి. అసలు

ఈ తప్పు ఎలా జరిగింది' అనుకున్నాడు. వారం క్రితం కృష్ణచైతన్యగారు ఆఫీసులోని ప్రతి సీటుకూ వచ్చి నిలబడ్డారు.

ఆయన వినయంగా చేతులు జోడించి - "నా కూతురికి అన్నప్రాశన, మీరంతా మా ఇంటికి వచ్చి భోజనం చేసి, నా కూతుర్ని ఆశీర్వదించాలి" అన్నాడు.

ఆఫీసులో అందరూ ఆయన మాటలకు ఆశ్చర్యపోయారు. కారణం, ఆయనకు దాదాపు నలభయ్యేళ్ళ వయసు. ఇప్పుడు ఆరునెలల వయసు కూతురు.

అయితే, అసలు విషయం తెలిసింది. ఆయనకు పెళ్ళయ్యి పదేళ్ళ యినా పిల్లలు లేరు లేక లేక కూతురు పుట్టింది. అందుకే చాలా వైభవంగా అన్నప్రాశన కార్యక్రమం చేయబోతున్నారు. ఆయన ఆహ్వానంతో ఆఫీసులో చర్చలు మొదలయ్యాయి.

పాపకు ఆరునెలల వయసు కనుక అన్నప్రాశన సందర్భంగా వెండి కంచం, గ్లాసు ఇస్తే బావుంటుంది అనుకున్నారు. ఆఫీసులోని ఉద్యోగులంతా ప్రతి ఉద్యోగీ ఆ బహుమతులు కొనే నిమిత్తం అయ్యే ఖర్చు సమానంగా భరించాలని నిర్ణయించారు.

అలా, గోపాలం తన ఉద్యోగపు స్థాయినిబట్టి ఐదొందల రూపాయలు ఇవ్వాలి.

దానికి వెనుకాడాడు గోపాలం. ఈ మధ్యకాలంలో తన ఆర్థికస్థితి అదుపు తప్పింది. హౌసింగ్ లోన్ తీసుకుని రెండు బెడ్‌రూముల అపార్టు మెంట్ కొన్నాడు.

అలాగే గృహప్రవేశానికి చాలా ఖర్చుయింది. ఈ నేపథ్యంలో కూతురు మహాలక్ష్మి పెద్దమనిషి అయింది. ఇలా ఖర్చుమీద ఖర్చు. భార్య చిన్న ప్రైవేటు

స్కూల్లో ఉద్యోగం చేస్తుండడంతో ఏదో కాస్త వెసులు బాటు. లేకపోతే తన పరిస్థితి ఏమయ్యేదో?! అందుకే తను ఐదొందలు ఇవ్వలేననీ, ఒక గిఫ్ట్ కొనేసి ఇస్తానని ఆఫీసువాళ్ళను బతిమాలుకున్నాడు.

దానికీ కారణం ఉంది- ఈ మధ్య తన గృహప్రవేశానికీ, కూతురు పంక్షనుకూ చాలా బహుమతులు వచ్చాయి. వాటన్నిటినీ తను బెడ్ రూములోని ఒక అల్మరాలో చాలా పదిలంగా దాచాడు.

ఎవరు ఏ ఫంక్షనుకు పిలిచినా వాటిని ప్యాక్ చేయించి ఇచ్చేస్తున్నాడు. సరిగ్గా రెండు రోజుల క్రితం జరిగింది. ఆ అన్నప్రాశన శుభకార్యం.

తను ఆఫీసునుంచి శ్రీమతికి ఫోన్ చేశాడు.

“నువ్వు మహాలక్ష్మిని తీసుకుని మా రీజనల్ మేనేజర్ గారి ఇంటికి వచ్చెయ్యి. వచ్చేటప్పుడు మన ఇంట్లోని అల్మరాలోవున్న గిఫ్టుల్లో ఏదో ఒక గిఫ్టు తీసుకుని ప్యాక్ చేయించుకుని తీసుకుని రా!” అనేశాడు.

భార్య తను తయారయ్యే హడావుడిలో కూతురికి ఆ పని అప్ప చెప్పింది. కూతురు తమ బెడ్‌రూము అల్మరాలో దాచిన గిఫ్టులన్నీ వెతికి ఒక ఇత్తడి పళ్ళెం బయటకు తీసింది.

‘అన్నప్రాశన కదా ఇత్తడి పళ్ళెమే బావుంటుంది. పైగా అరిటాకు డిజైనులో అందంగా ఉంది’ అనుకుంది ఆ పన్నెండేళ్ళ అమ్మాయి మహాలక్ష్మి. బాత్‌రూమ్‌లో ఉన్న తల్లికి ఆ విషయం చెప్పడం మర్చిపోయింది. తనే గబగబా అపార్టుమెంట్ పక్కనే ఉన్న షాపులో ఆ గిఫ్టును ప్యాక్ చేయించింది. మధ్యాహ్నం తను మిగతా సహచరులతో రీజనల్ మేనేజర్ గారింటికి సరాసరి వచ్చేస్తే, భార్య కూతుర్ని తీసుకుని వచ్చింది.

ఆరునెలల తమ కూతురికి కృష్ణచైతన్య గారు, ఆయన శ్రీమతి అన్నప్రాశన ఉత్సవం ఘనంగా చేశారు. భోజనాలైన తర్వాత భార్య తెచ్చిన

గిఫ్టును పాపచేతిలో ఉంచి అక్షింతలు చల్లి తను ఆఫీసుకు వచ్చేశాడు. కూతుర్ని తీసుకుని శ్రీమతి ఇంటికి వెళ్ళింది.

కృష్ణచైతన్యగారి అమ్మాయికి తను ఇచ్చిన గిఫ్ట్ ఏమిటి? పొడుగ్గా ఉండి ప్లేటులా ఉంది. తమ గృహప్రవేశానికి, పాప ఫంక్షనుకు అలాంటి బహుమతులు వచ్చినట్టు గుర్తులేదు, మరి కూతురికి అది ఎలా దొరికింది? కొంపదీసి రెండేళ్ళుగా తను పదిలంగా దాస్తూ వస్తున్న ఆ గిఫ్టు తెచ్చేసిందా?!!

అతని గుండెల్లో రాయిపడినట్టయింది. గబగబా ఇంటికి పరిగెత్తాడు. అల్మరా అంతా వెతికాడు. ఆ గిఫ్టు కనపడలేదు. కూతురు స్కూలునుంచి రాగానే ఆమె చెప్పిన విషయంతో గుండె ఆగినట్లైంది గోపాలానికి.

అరిటాకు డిజైనులో వున్న ఆ ఇత్తడిపళ్ళెం రెండేళ్ళ క్రితం మహాలక్ష్మమ్మ అనే ఆవిడ తద్దినపు భోజనానికి వెళ్ళినప్పుడు తనకు వచ్చిన బహుమతి. మహాలక్ష్మమ్మ గారి జ్ఞాపకార్థం రెండేళ్ళుగా ఆ పళ్ళెం దాస్తూ వస్తున్నాడు. దాన్ని దాయడం వెనక ఒక పెద్ద కథ.

అది పోయిందనే బాధ ఒకవైపు, మరోవైపు ఒక అపరకర్మలో వచ్చిన గిఫ్టును ఒక శుభకార్యంలాంటి అన్నప్రాశనలో తిరిగి బహుమానంగా ఇచ్చెయ్యడం. అదీ తన పై అధికారి అయిన రీజనల్ మేనేజర్‌గారి ఇంట జరిగే అన్నప్రాశనలో తను ఇచ్చెయ్యడం.

ఆ ఇత్తడి పళ్ళెంమీద స్పష్టంగా 'మహాలక్ష్మమ్మగారి జ్ఞాపకార్థం' అని రాసిన అక్షరాలు. వాటిని చూస్తే కృష్ణ చైతన్యగారికి తను చేసిన ఆ అప్రాచ్యపు పని ఏమిటో అర్థమై ఆయన సెంటిమెంటల్‌గా ఫీలయితే తన పరిస్థితి ఏమిటి? అందుకే ఫంక్షను అయిన రోజునుంచీ సెలవు పెట్టి కృష్ణచైతన్య గారికి కనపడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.

'రేపు తప్పనిసరిగా వెళ్ళాలి. జీతాలు ఇచ్చే రోజు' తనే జీతాలబిల్లు

తయారుచేసి బ్యాంకుకి పంపుతాడు, అలా ఆలోచనలతో సతమతమయిన గోపాలానికి ఆ రోజు రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు.

ఉదయం ఎనిమిదయినా నిద్రనుంచి లేవలేక పోయాడు గోపాలం. అప్పటికే నిద్రనుంచి లేచిన భార్య కూతుర్ని స్కూల్‌కి పంపడానికి తయారు చేస్తోంది. “ఏంటండీ? ఉదయం ఐదింటికే లేచేవారు, ఇవాళ ఎనిమిదైనా లేవరేం, మీ బాస్‌కి ఎలా ముఖం చూపిద్దామనా?! చెప్పాను కదా, క్షమించమని కాళ్ళమీద పడండి. అంతే” అంటూ వంటగదిలోకి వెళ్లింది.

మంచంమీంచి లేకుండానే దిగులుగా ఉండి పోయాడు గోపాలం. అసలు తనెందుకు భయపడుతున్నాడు? బాస్ ఏం చేస్తాడని? కోపగించి తనను పాడేరుకో, చింతపల్లి ఏజెన్సీ ఏరియాకో బదిలీ చేస్తాడనా? లేక తన ప్రమోషన్ ఆపుతాడనా? అసలు తనకున్న ఆ కోరికలవల్లే కదా ఇంత అలజడి.

‘అవును ధైర్యం తెచ్చుకోవాలి. సమస్యను సూటిగా చూడాలి, జరిగేది జరగక మానదు’ అలా అనుకుంటూ వేగంగా కాలకృత్యాలు ముగించాడు.

“కంగారుపడకండి. ఏమీకాదు” శ్రీమతి భరోసా ఇచ్చింది మరోసారి.

పావుగంట తరువాత రోడ్డుమీద ఉన్నాడు. ధైర్యంగా ఉందా మనుకున్నా మనసులో భయం నీడలు. ఇంకా వర్షం పడుతూనే వుండడంతో ఆటో ఎక్కాడు. ఆఫీసుకు వెళ్ళాడు. పార్కింగ్ ప్లేసులో బాస్‌గారి కారు లేదు. ‘అమ్మయ్య, ఇంకా ఆయన రాలేదు’ అనుకుంటూ లిఫ్ట్ ఎక్కి మూడో అంతస్తులో ఉన్న తమ ఆఫీసుకు చేరుకున్నాడు గోపాలం.

తన సీటువైపు అడుగులు వేస్తుంటే ఏదో అలజడి. సీట్లో కూర్చుని గోడగడియారం వైపు దృష్టి సారించాడు. చిన్నముల్లు పదిమీదకు వచ్చేసింది. ‘ఈ పాటికి బాస్ వచ్చేసివుండాలి, టైమ్ తప్పయివుంటుందేమో’ చేతి గడియారంవంక చూశాడు. అదే టైమ్ చూపించింది. ఏమయ్యింది, బాస్ కరెక్ట్ టైముకు వస్తాడు’ ఇంతలో తన టేబుల్‌మీది ఇంటర్‌కమ్ ఫోన్ మోగింది.

“గోపాలంగారూ, బాస్ ఒకసారి మిమ్మల్ని ఇంటికి రమ్మంటున్నారు. ఆయన ఇవాళ సెలవు పెట్టారు. కింద కంపెనీ కారుంది. మిమ్మల్ని తీసుకు వెళ్ళమని డ్రైవరుకు చెప్పాను.”

కృష్ణచైతన్యగారి పి.ఎ. మాటలతో గోపాలం పై ప్రాణాలు పైనే పోయాయి. ఆయనకు తను చేసిన నిర్వాకం తెలిసిపోయింది, తన భవిష్యత్తు నిర్ణయం అయిపోయింది. దుఃఖపడుతూనే లిఫ్ట్ దిగి, గ్రౌండ్ ఫ్లోర్‌లోని తమ కంపెనీ కారెక్కాడు గోపాలం.

పావుగంటలో కారు కృష్ణచైతన్యగారి ఇంటిముందు నిలబడి తలుపు పక్క నున్న బెల్ కొట్టాడు. పనమ్మాయి కాబోలు తలుపుతీసింది.

“కూర్చోండి, అయ్యగారు పూజగదిలో ఉన్నారు” అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

భయం భయంగా కూర్చున్నాడు గోపాలం.

బయట వర్షం. లోపల చల్లగా తగులుతున్న ఫ్యాన్ గాలి. అయినా గోపాలానికి ఆ వాతావరణం వేడిగా అనిపించింది. ఐదు నిముషాలతర్వాత పనమ్మాయి మంచినీళ్ళ గ్లాసు, కాఫీ కప్పుతో వచ్చింది. ఏమీ తాగాలనిపించ లేదు. ఎదురుగా వున్న గుమ్మంవైపు చూస్తూ కూర్చున్నాడు. క్షణాలు భారంగా గడిచాయి.

ఇంతలో ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు తలెత్తి చూసిన గోపాలానికి నోట్లోంచి మాట రాలేదు. లాల్చీ పైజమాలో వచ్చిన కృష్ణ చైతన్యగారివంక అలా చూస్తూనే వుండిపోయాడు. వెంటనే లేచి రెండు చేతులూ జోడించాడు. “కూర్చోండి” అంటూ ఆయన తనకెదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

“కాఫీ తాగండి... చల్లారిపోతుంది” ఆయన మాటలతో కప్పు చేతిలోకి తీసుకుని, “సార్ క్షమించండి, ఘోరతప్పిదం” అతడి మాటలు పూర్తికాక

మునుపే, ఆయన గోపాలంవైపు చూస్తూ, "మీకు మహాలక్ష్మమ్మ గారు ఎలా తెలుసు!?" ఆశ్చర్యంగా గోపాలంవైపు చూస్తూ అడిగాడు కృష్ణచైతన్య.

"అవును సార్... అమ్మకాని అమ్మ, ఆవిడ కడుపున పుట్టకపోయినా నాకు ఆవిడ అమ్మేసార్" అన్నాడు గోపాలం. "అలాగా" అన్నాడాయన, ఇంకా ఆశ్చర్యంగానే గోపాలం వంక చూస్తూ.

బాస్ తన మాటలకు ఎందుకు ఆశ్చర్యపడుతున్నాడో గోపాలానికి అర్థం కాలేదు. ఐనా, ఆయన ముఖం ప్రసన్నంగా కనిపించడంతో అతడిలోని అలజడి తగ్గింది. క్షణంసేపు మౌనంగా ఉండి పోయాడు. "చెప్పండి మహా లక్ష్మమ్మగారి గురించి?" అన్నాడు కృష్ణచైతన్య సోఫాలో వెనక్కి వాలి.

గోపాలం కళ్ళు మూసుకున్నాడు. అంతవరకూ వేగంగా కొట్టుకున్న గుండె ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. క్షణంసేపు ఊపిరి పీల్చుకున్నాడు. జరిగిపోయిన సంఘటనలు తెరమీద బొమ్మల్లా నిలిచాయి.

పదిహేనేళ్ళ క్రితం ఒంగోలులోని ఒక పొగాకు కంపెనీలో తను చిన్న ఉద్యోగి. ఉద్యోగం పర్మినెంటవు తుందనుకున్నాడు. చేరిన రెండునెలలకే కంపెనీ మూతపడింది. స్వంత ఊళ్ళో తనమీద ఆధారపడ్డ తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లాయి వారికోసమైనా తను ఉద్యోగం సంపాదించాలని మొండికేసి, ఆ ఊళ్ళోనే ఉండిపోయాడు.

దొరికినచోటల్లా అప్పుడు చేస్తూ నెట్టుకొచ్చాడు. కొన్ని రోజులు ఒక పూట భోజనం, మరికొన్ని రోజులు బ్రెడ్డు, టీనీళ్ళు. అలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో ఒకరోజు ఆకలికి ఆగలేక కళ్ళు బైర్లు కమ్మాయి తన రూము పక్కనున్న సందువరకూ వెళ్ళాడు తెలిసినవాళ్ళు కనిపిస్తారేమోనని. అక్కడ మహాలక్ష్మమ్మ మెస్సు.

'అమ్మా, కాస్త అన్నం పెట్టు' అని అడుగుదామనుకున్నాడు. సిగ్గుపడి ఊరుకున్నాడు. లోపల గదిలో మహా లక్ష్మమ్మగారు అరిటాకులో అందరికీ

భోజనం వడ్డిస్తోంది. ఆవిడనే చూస్తూ అలాగే నుంచున్నాడు. కొంచెం సేపటికి తను ఆ రోడ్డుమీదే శోషవచ్చి పడిపోయాడు.

ఆవిడ పరిగెత్తుకుంటూ వచ్చింది. ముఖంపై నీళ్ళు జల్లింది. "ఏం నాయనా ఒంట్లో బాగోలేదా?" అంది మహాలక్ష్మమ్మగారు తన కళ్ళల్లోకి చూస్తూ.

తను సమాధానం చెప్పలేదు. తన జబ్బేమిటో ఆ తల్లికి అర్థమయింది. గబగబా లోపలకు తీసుకుళ్ళింది. అరిటాకులో వేడి అన్నం, పప్పుచారు, నెయ్యి.... అంతే, తను ఎలా తిన్నాడో తెలీదు. ఆ మెస్సులోనే నేలమీద ఒరిగిపోయాడు. సాయంత్రానికి గానీ లేవలేదు.

లేచిన తరువాత సిగ్గుపడ్డాడు. "అమ్మా! డబ్బులు లేవు" అని చెప్ప టానికి బాధపడ్డాడు.

ఆ విషయమూ ఆ మహాతల్లి అర్థం చేసుకుంది.

"నాయనా, చిన్నవయసులో ఉన్నావు. ఇంకా బోలెడు భవిష్యత్తు ఉంది. ఆకలితో అలా అనారోగ్యం కొని తెచ్చుకోకు, నీ దగ్గర డబ్బులున్నప్పుడే ఇవ్వు" అంది. ఆ మాటలు, తనకు కొండంత బలాన్నిచ్చాయి. ఉదయమే లేచి ప్రతి ఆఫీసుచుట్టూ తిరిగేవాడు.

మధ్యాహ్నం అయ్యేసరికల్లా మహాలక్ష్మమ్మ మెస్సుకు చేరుకుని ఆవిడ పెట్టిన ఓ ముద్ద తిని, తిరిగి మళ్ళీ ఆఫీసులు చుట్టేవాడు. అలా నెల రోజులు గడిచేసరికి ఒక చిన్న ఉద్యోగం దొరికింది.

ఆ నెల్లాళ్ళూ తను ఒక్క పైసా ఆమెకు ఇవ్వకపోయినా కడుపునిండా భోజనం పెట్టేది. ఒక విధవరాలు ఏ తోడూలేని ఒక ఆడమనిషి తన ఒక్కడినే పోషిస్తోంది అనుకున్నాడు.

తనేకాదు తనలాంటి పరాన్నజీవులు ఐదారుగురు ఉండేవారు- అలా

కృష్ణచైతన్య అడగ్గానే తన మనసులో ఉన్న ఆవిడ గురించిన గతాన్ని వివరంగా చెప్పాడు. చెపుతూ చెపుతూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు గోపాలం.

గోపాలం చెపుతున్న మహాలక్ష్మమ్మ చరిత్ర వింటున్న కృష్ణచైతన్య కళ్ళూ తడికావడం, వాటిని తుడుచుకోవడం గోపాలం గమనించాడు.

క్షణంసేపు ఆగి మళ్లీ చెప్పడం మొదలు పెట్టాడు. "సార్, ఆ తల్లి నాకు తిండి పెట్టడం వల్లే బతికి బట్టకట్టాను. చిన్న ఉద్యోగం సంపాదించుకుని నా కుటుంబాన్ని పోషించుకున్నాను. ఆ తర్వాత మన కంపెనీలో ఉద్యోగం సంపాదించాను. ఆ ఊరు వదిలిపెట్టాను.

అయినా ఆవిడను మరచిపోలేదు. నా జ్ఞాపకాలలో పదిలంగా ఉంచాను. నా కూతురికి ఆవిడ పేరే పెట్టుకున్నాను" చెప్పడం ఆపి కృష్ణ చైతన్య ముఖంలోకి చూశాడు గోపాలం.

ఆయన ముఖంలో ఏదో బాధ.... బహుశా తను చెపుతున్న విషయానికి ఆయన స్పందిస్తున్నారు అనుకుంటూ తన సంభాషణ కొనసాగించాడు. "అలాంటి మహాతల్లి రెండేళ్ళ క్రితం చనిపోయింది. ఆ విషయం తెలిసి వెంటనే ఒంగోలు పరిగెత్తాను.

ఆవిడ అంతిమయాత్రలో పాల్గొన్నాను. ఆ తల్లి దశదినకర్మకు వందలాదిమంది వచ్చారు. ఆవిడ మెస్సులో భోజనంచేసినవాళ్ళంతా ఆవిడ జ్ఞాపకార్థం ఏదో ఒకటి చేయాలనుకున్నారు.

ఆవిడ అందరికీ అరిటాకులో వడ్డించేది, అలా ఆవిడ అందరి మనసుల్లో ఉండిపోవాలని అరిటాకు డిజైనులో చేసిన ఇత్తడి పళ్ళేలను తయారుచేయించి ఆవిడ కర్మకాండలో పాల్గొన్న అందరికీ పంచారు, అలా నాకు ఒక ఇత్తడిపళ్ళెం అందింది. దాన్ని రెండేళ్ళుగా దాస్తూవస్తున్నాను.

మనసు బాగోలేనప్పుడు ఆ పళ్ళేన్ని చూస్తే చాలు, ఆ తల్లి మాకు పంచిన ప్రేమ, ఆప్యాయతలు గుర్తు కొస్తాయి. కళ్ళు చెమ్మగిల్లుతాయి.

అలాంటి తల్లులవల్లే కదా, లోకం ఇంకా పచ్చగా, ఉంది.. అని పిస్తుంది. ఆ పళ్ళెం నా పొరపాటువల్ల మీ అమ్మాయి అన్నప్రాశన ఫంక్షన్‌లో బహుమతిగా ఇచ్చాము. అలా ఇవ్వడం అనుచితం, పైగా పాపం... జరిగిన తప్పిదానికి క్షమించండి. ఆ పళ్ళెం తిరిగి ఇప్పించండి'' అన్నాడు గోపాలం కళ్ళనీళ్ళు పెట్టుకుని, తన బాస్ కృష్ణచైతన్యగారి రెండు చేతులూ పట్టుకుని.

కృష్ణచైతన్య కళ్ళనిండా నీళ్ళు. క్షణంసేపు ఆయన మాట్లాడకుండా గోపాలం చేతుల్ని పట్టుకుని ఉండి పోయాడు. ఆ తర్వాత నోరు విప్పాడు. ''గోపాలంగారూ... మీకందరికీ తెలియని ఒక నిజం నేనిప్పుడు చెపుతాను. తన మెస్సుద్వారా ఆ తల్లి మీ అందరి ఆకలితీర్చింది. డబ్బులు ఇచ్చినా, ఇవ్వకపోయినా భోజనం పెట్టింది.

అలాగే నాలాంటి దౌర్భాగ్యుడిని ఎంతో విద్యావంతుడిని చేసింది. విదేశాలకు పంపింది. మీ కందరికీ అంత సహాయం చేసిన ఆవిడతో మీకే సంబంధమూ లేదు. కానీ నన్ను ఎన్నో పెద్ద చదువులు చదివించిన ఆ తల్లితో ఈ అల్పుడికి సంబంధం ఉంది'' అన్నాడు కృష్ణచైతన్య దాదాపు ఏడుస్తూ.

''ఆవిడ మీకు ఏమవుతారు సార్?'' అన్నాడు గోపాలం ఆశ్చర్యంగా. ''ఆవిడతో నాకున్నది పేగు సంబంధం, గోపాలంగారూ... నన్ను తొమ్మిది నెలలు మోసి, కని పెంచిన తల్లి మహాలక్ష్మమ్మ'' అన్నాడు కృష్ణచైతన్య కళ్ళు తుడుచుకుంటూ.

ఆ మాటలతో అంతవరకూ తెలియని సత్యం, తెలిసిన ఆశ్చర్యంలో అలా నోట మాటరాక గోపాలం నిలుచుండిపోయాడు. తను వింటున్న ఆ విషయం కలో, నిజమో కాసేపు అర్థం కాలేదు గోపాలానికి. కృష్ణ చైతన్య ఇంకా దుఃఖపడుతూనే తన మాటల ప్రవాహాన్ని కొనసాగించాడు.

''నా తండ్రి రోడ్డు ప్రమాదంలో చనిపోతే తను పూటకూళ్ళమ్మ అవతారం ఎత్తింది.

నా ఐఐటి చదువుకోసం, మేనేజిమెంట్ చదవుకోసం నడుం ఎత్తకుండా పనిచేసింది. ఏ సంబంధమూ లేని మీరంతా ఆవిడ అంతిమ సంస్కారంలో పాల్గొని సంస్కారవంతులు అయ్యారు. నేను ఆవిడ కడుపున పుట్టినా ఆవిడ చావుకబురు తెలిసీ విదేశాల్లో ఉండి పోయాను. అదీ నా సంస్కారం''-

చెపుతున్న కృష్ణచైతన్య క్షణంసేపు ఆగి అక్కడ టీపాయ్‌మీద ఉన్న నీళ్ళుతాగి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు. "గోపాలంగారూ మీ అందరి ముందూ నేను చదువులోనూ, పదవిలోనూ గొప్పవాడినే...

కానీ, ఏ చదువు, కనీసం అక్షరజ్ఞానం లేని నా తల్లి ముందు అత్యంత అల్పుడిని, చదువంటే అక్షరం కాదు, జ్ఞానం ఆ జ్ఞానంతో నా తల్లి మీ అందరి గుండెల్లోనూ ఇప్పటికీ నిలిచేవుంది. ఇంకా మీరన్నారు, మీ కూతురికి 'మహాలక్ష్మి' అనే పేరు పెట్టుకున్నానని, అది చాలు నా తల్లి చిరంజీవిగా మిగిలిపోవడానికి.

మరి నేను, నా చదువు, హెూదా, వీటితో మీ దగ్గర ఒక అశాశ్వతమైన గుర్తింపు తెచ్చుకున్నాను'' ఆయన చెప్పడం ఆపి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీళ్ళు. ఆ కన్నీటి మధ్య ఒక వాక్యం మాత్రం స్పష్టంగా చెప్పాడు.

"గోపాలంగారూ, దయచేసి ఆ ఇత్తడి పళ్ళేన్ని నా నుంచి దూరం చెయ్యకండి.. అన్నప్రాశన రోజున నా తల్లి తన మనవరాల్ని ఆశీర్వదించి ఇచ్చినట్టుగా నా కనిపిస్తోంది'' చెప్పడం ఆపి కృష్ణచైతన్య రెండు చేతులూ జోడించాడు. గోపాలం తనూ నమస్కారం చేసి ఆ ఇంట్లోంచి గబగబా బయటకు నడిచాడు.

వర్షం వెలిసింది. మబ్బుల్లోంచి బయటకొచ్చిన సూర్యుడి కిరణాలు మెల్లగా తాకుతున్నాయి.

అంతవరకూ అల్లకల్లోలంగా అయిపోయిన గోపాలం మనసు ఇప్పుడు ప్రశాంతంగా ఉంది.

ఆఫీసుకు వెళ్ళడానికి కంపెనీ కారు ఎక్కబోతున్న గోపాలానికి ఎవరింట్లోంచో ఒక అమ్మాయి బిగ్గరగా చదువుతున్న పద్యం వినిపించింది.

“తల్లి తండ్రి మీద దయలేని పుత్రుండు

పుట్టనేమి వాడు గిట్టనేమి!

పుట్టలోన చెదలు పుట్టవా, గిట్టవా!

విశ్వదాభిరామ వినురవేమ!

కృష్ణచైతన్యగారు ఎందుకు అంత దుఃఖపడ్డారో ఇప్పుడు గోపాలానికి పూర్తిగా అర్థమయింది.

(స్వాతి సపరివార పత్రిక 2013)